ఒంటరి డాన్..పుష్ప

ఇళ్లను ధ్వంసం చేస్తున్న పుష్ప ఏనుగు ఇదే , గతంలో భాస్కర్ నాయుడు ఇంటి పెంకులను ధ్వంసం చేసిన ఏనుగూ ఇదే





ఒంటరి ఏనుగు పలమనేరు మండల ప్రజలకు కంటికి కునుకు లేకుండా చేస్తోంది. పంటలపై దాడులు చేసి నష్టం కలిగించడమే కాకుండా ఇప్పుడు ఏకంగా ఇళ్లపై సైతం దాడులకు తెగి హడలెత్తిస్తోంది. తాజాగా పట్టణ సమీపంలోని బండమీద జరావారిపల్లెలో పొలాలవద్ద ఓ ఇంటిపై ఆదివారం రాత్రి దాడి చేసి ధ్వంసం చేసేందుకు యత్నించింది. ఇంటిపై నున్న రేకులను పెకలించి, గోడను కూల్చి, ఇంట్లోకి తొండం పెట్టింది. ఏనుగు వీరంగానికి ఆ ఇంట్లోని రెడ్డెప్ప కుటుంబీకులకు ప్రాణ భయంతో బిక్కచచ్చిపోయారు. క్షణ మాలస్యం చేయకుండా పరుగులు తీసి ఏనుగు బారి నుంచి తప్పించుకున్నారు.

- గజగజలాడిస్తున్న ఏనుగు
- గుంపును వీడి ఏకాకిలా సంచారం
- మునలిమొడుగు నుంచి కీలపట్ల వరకూ దీని రూట్
- తరచూ మొగిలి ఘాట్‌లో హైవే దాటుతున్న వైనం
- తాజాగా బి.జరావారిపల్లెలో ఇంటిపై దాడి చేసి విధ్వంసకాండ
- మేత కోసం పంటలపైనే కాకుండా ఇళ్ల మీద సైతం దాడులు!
- ఒక ఇంట రాగులు, మరో రెండిళ్లలో ధాన్యం ఆరగించి వెళ్లిన వైనం


పలమనేరు: పలమనేరు కౌండిన్య అభయారణ్యంలో వందకు పైగా ఏనుగులు గుంపులుగా సంచరిస్తున్నాయి. వీటిల్లో ఆరుదాకా మదపుటేనుగులు అడవిలోని ఆయా ఏరియాల్లో డాన్లుగా మారాయి. వీటిలో పుష్ప అని పేరు పెట్టిన మదపుటేనుగు నెల నుంచి ప్రజలను హడలెత్తిస్తోంది. తీవ్రమైన కోపంతో వేగంగా సంచరించే ఈ ఒంటరేనుగు జనంపై కసి పెంచుకుంది. తాజాగా పలమనేరు సమీపంలోని బండమీద జరావారిపల్లెలో పొలాలవద్ద నివాసం ఉంటున్న ఓ ఇంటిపై ఆదివారం రాత్రి దాడి చేసింది. ఇంట్లో నలుగురు కుటుంబ సభ్యులు ఉండగానే ఉండగానే ఆ ఇంటిని ధ్వంసం చేసేందుకు యత్నించింది. ఇంటిపైనున్న రేకులను పెకలించి, గోడను కూల్చి, ఇంట్లోకి తొండం పెట్టి రాగులను అప్పనంగా ఆరగించింది. దీంతో ఇంట్లోని రెడ్డెప్ప కుటుంబీకులు ప్రాణాలను అరచేత పెట్టుకుని బతుకు జీవుడా అని చీకట్లోనే పరుగులు తీశారు.

నిత్యం 20 మైళ్ల ప్రయాణం

పుష్పా మదపుటేనుగు మండలంలోని మునలిమొడుగు అటవీ ప్రాంతాన్ని తన అడ్డాగా చేసుకున్నట్లు అటవీ శాఖ ఇప్పటికే గుర్తించింది. ఆ ప్రాంతం నుంచి తరచూ పెంగరగుంట, బేరుపల్లె, టీఎస్ అగ్రహారం, మున్సిపల్ డంపింగ్ యార్డుల మీదుగా మొగిలి ఘాట్‌ను హైవేలో దాటి గాంధీనగర్, జగమర్ల, బండమీద జరావారిపల్లె, కీలపట్ల వరకూ సంచరిస్తోంది. ఈ ఏనుగును ఎలా కట్టడి చేయాలో అటవీశాఖ ఎలిఫెంట్ ట్రాకర్లకు సైతం దిక్కుతోచడం లేదు. ప్రస్తుతం ఇది గుంపులకు దూరంగా ఒంటరిగా సంచరిస్తోంది. ఇదే తరచూ ఇళ్లను టార్గెట్‌గా చేస్తోందని ఎఫ్ఎస్వో సుకుమార్ తెలిపారు. మేటింగ్ సీజన్ జనవరి వరకూ ఉండడంతో ఇది మదమెక్కి రౌడీలా మారిందని ఫారెస్ట్ అధికారులు చెప్పారు. ఏదేమైనా పుష్పా ఏనుగు కారణంగా పలమనేరు, గంగవరం మండలాల్లోని అడవికి ఆనుకొని పొలాల వద్ద కాపురాలుంటున్న రైతన్నల కుటుంబాలు హడలిపోతున్నాయి.

వరుసగా ఇళ్లపైనే దాడులు

ఇలా ఉండగా ఇదే పుష్పా ఏనుగు మండిపేట కోటూరుకు చెందిన భాస్కర్‌నాయుడు పొలం వద్దనున్న ఇంటిని పెంకులను ధ్వంసం చేసి ఇంట్లోని ధాన్యాన్ని ఆరగించింది. తాజాగా బండమీద ఇండ్లుకు చెందిన విజయన్ ఇంటి కిటికీలను విరిచి ఇంట్లోని ధాన్యాన్ని లాగించింది. కుక్కలు మొరగ్గానే అక్కడ ఖచ్చితంగా ఇల్లు ఉంటుందని గ్రహించే ఈ మదపుటేనుగు అక్కడికే వెళ్లి మరీ ఇళ్లను ధ్వంసం చేయడం అలవాటుగా మార్చుకుంది.



నాలుగు రోజుల క్రితం విజయన్ ఇంటి కిటికీ కూల్చి ధాన్యాన్ని ఆరగించిన ఏనుగు

క్లుప్తంగా

వర్షంతో మొలకెత్తని వేరుశనగ విత్తనాలు



మొలకెత్తని వేరుశనగ విత్తనాలు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని రైతులు నీటి ఆధార పంటగా బోర్ల కింద రబీ సీజన్‌లో వేరుశనగ విత్తనాలను వేశారు. అయితే గింజ భూమిలో వేసిన వెంటనే వారం రోజులుగా వర్షాలు పడడంతో గింజలు కుళ్లి పోయి మొలకెత్తకుండా పోయింది. దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొన్ని చోట్ల అరకొరగా మొలిచినా ఉపయోగం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

సౌత్‌జోన్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపిక



మహమ్మద్ బాషా

గంగవరం: సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు మండలంలోని మదర్‌థెరిసా కళాశాల ఎంసీఏ విద్యార్థి మహమ్మద్‌బాషా ఎస్వీ యూనివర్సిటీ జట్టుకు ఎంపికయ్యాడని ఆ కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. 21వ తేదీ నుంచి ఈ పోటీలకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ యూనివర్సిటీ ఆతిథ్యమిస్తోందన్నారు. బాషాను కళాశాల యాజమాన్యంతోపాటు అధ్యాపక బృందం అభినందించింది.

స్వచ్ఛ గ్రామ పంచాయతీగా గుర్తింపు తెద్దాం



రికార్డులను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణవేణి

చౌడేపల్లె: మండలంలోని దిగువపల్లె పంచాయతీను స్వచ్ఛ గ్రామ పంచాయతీగా గుర్తింపు తెద్దామని ఈఓపీఆర్డీ కృష్ణవేణి అన్నారు. మంగళవారం ఆమె గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చేస్తున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. బోయకొండ గంగమ్మ ఆలయం చెంతనున్న ఈ పంచాయతీని ప్రజాప్రతినిధుల సహకారంతో అభివృద్ధి చేయడానికి సహకరించాలన్నారు. తాగునీరు, పారిశుధ్య సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్‌కు ఆదేశించారు. డంపింగ్ యార్డును వినియోగంలోని తేవాలన్నారు.

ఇంటింటా వైద్య పరీక్షలు



రక్తపోటు పరీక్షలు చేస్తున్న ఆశా కార్యకర్తలు

రామకుప్పం: ఎన్‌సీడీసీసీడీ కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలు మంగళవారం రామకుప్పంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. చక్కెర స్థాయి, బీపీ ఎక్కువగా ఉన్నట్లయితే వెంటనే స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిని సంప్రదించాలని ఆశా కార్యకర్తలు సూచించారు. అలాగే పీహెచ్‌సీలో ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

అబ్దుల్ సుభాన్‌కు జీవిత సాఫల్య పురస్కారం



జీవిత సాఫల్య పురస్కారం అందుకుంటున్న అబ్దుల్ సుభాన్

పలమనేరు: ప్రపంచ మానవ హక్కుల మండలి 76 వార్షికోత్సవం సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని లక్నోలో మంగళవారం జరిగిన సమావేశంలో పలమనేరుకు చెందిన ఆ సంఘ దక్షిణ దేశ మీడియా కార్యదర్శి అబ్దుల్ సుభాన్ జీవిత సాఫల్య పురస్కారం, మెడల్‌ను అందుకున్నారు. కార్యక్రమంలో ఆ రాష్ట్రానికి చెందిన ప్రముఖులు, రాజకీయ నేతలు, ప్రపంచ దేశాలకు చెందిన ప్రతినిధులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం

సదుం: తహజీల్దార్ మారుఫ్ హుస్సేన్‌ను పుంగనూరు నియోజకవర్గ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ ఉదయ భాస్కర్ మంగళవారం సన్మానించారు. తహసీల్దార్ ఇటీవల జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో సన్మానించినట్లు చెప్పారు.

సీహెచ్‌సీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి చిత్రం



ఎమ్మెల్యే చిత్రాన్ని ఏర్పాటు చేస్తున్న నాయకులు

సదుం: స్థానిక సీహెచ్‌సీలో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఫొటోను వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం ఏర్పాటు చేశారు. ఆస్పత్రి నిర్మాణానికి స్వంత స్థలం ఇవ్వడంతో పాటు యాభై పడకల ఆసుపత్రి ఏర్పాటుకు ఆయన ఎంతగానో కృషి చేశారని వారు చెప్పారు. ప్రొటోకాల్ ప్రకారం ఫొటో పెట్టామన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, పుత్రాజు, చిన్న రమణ, రాజశేఖర్, దాము, రమేష్, అన్నారెడ్డి, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారుల వేధింపులకు మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: వడ్డీ వ్యాపారుల వేధింపులకు తాళలేక ఓ మహిళ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వివరాలు..పట్టణంలోని కొత్తయిండ్లులో నివాసమున్న షభానా కుటుంబ అవసరాల నిమిత్తం పలువురి వద్ద అప్పులు చేసింది. సకాలంలో వడ్డీతోపాటు అప్పు అసలు చెల్లించినప్పటికీ ఇంకా బాకీ ఉన్నావంటూ వడ్డీ వ్యాపారులు వేధించడం, అవమానించడంతో పాటు వారి వికృత చేష్టలకు కుంగిపోయింది. మంగళవారం ఇంట్లోనే నిద్రమాత్రలు మింగింది. అపస్మారస్థితిలో ఉన్న షభానాను గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆమె చికిత్స పొందుతోంది. పోలీసులు విచారణ చేస్తున్నారు. ఆమె ఎవరెవరి వద్ద, ఎంత మొత్తంలో అప్పు చేసింది? వేధిస్తున్న వారెవరో పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

మానవ హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యత



కల్లూరులో విద్యార్థుల ర్యాలీ

పులిచెర్ల(కల్లూరు): రాజ్యాంగం ప్రసాదించిన మానవ హక్కులకు భంగం కలగకుండా కాపాడుకోవడం అందరి బాధ్యతని హెచ్ఎం శ్రీవాణి అన్నారు. మానవ హక్కుల దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కల్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో వెంకటసిద్దులు, రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, చలపతి, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..



రొంపిచెర్లలో..

రొంపిచర్ల: హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని విద్యావేత్త డాక్టర్ రఘునాథ్ అన్నారు. మంగళవారం రొంపిచెర్లలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఆసరా స్వచ్ఛంద సంస్థ, ప్రజా యూనియన్ నాయకులు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో ఎందరో మహానుభావులు మానవ హక్కుల కోసం ఉద్యమించి, బానిస బతుకుల విముక్తికి కృషి చేశారని చెప్పారు. నాయకులు గిరిబాబు, నరేష్, ఓబులేసు, చంద్రయ్య, రాజన్న పాల్గొన్నారు.

నేడు, రేపు ఆధార్ శిబిరం

కుప్పం: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం, గురువారం రెండు రోజుల పాటు ప్రత్యేకంగా ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ శ్రీనివాసులు కోరారు. పట్టణంలో కుప్పం బాలుర ఉన్నత పాఠశాల, ఎమ్ఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల, పరమసముద్రంలోని కస్తూర్బా ప్రభుత్వ బాలికల విద్యాలయంలో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆధార్ కార్డుల్లో మార్పులు-చేర్పులు చేసుకునే సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేడు నీటి సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

సదుం: మండలంలో నీటి సంఘాల ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ ఇవ్వనున్నట్లు డీటీ కుమార్ తెలిపారు. తిమ్మానాయనపల్లె పంచాయతీలోని వ్యాసప్ప చెరువు, చిక్కరాయ చెరువు, పాలమంద రెడ్డిచెరువు, తాటిగుంటపాలెంలోని అగ్రహారం చెరువు, పాలెం చెరువు, సదుంలోని సీతమ్మ చెరువు, చెరుకువారిపల్లెలోని అయ్యావానిచెరువుకు ఈ నెల 14న ఎన్నికలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మొత్తం 1487 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

శాంతిపురం: మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం, పంచాయతీ రాజ్ శాఖ ద్వారా చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదికను గురువారం నిర్వహిస్తున్నట్లు ఏపీఓ తుపాకుల హరి తెలిపారు. క్షేత్ర స్థాయి తనిఖీలు పూర్తి కావడంతో 12న ఉదయం 10 నుంచి మండల సచివాలయ ప్రాంగణంలో ఓపెన్ ఫోరం ఉంటుందన్నారు. ఉపాధి హామీ కూలీలు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు. కాగా, ఈ నెల 5న ప్రజావేదిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేసినా చివరి నిమిషంలో టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో వాయిదా పడటం విదితమే.

మసీదు వీధికి రోడ్డు వేయరూ!

పుంగనూరు: పట్టణంలో 12వ వార్డులోని కుబా మసీదు వీధికి రోడ్డు వేయాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతూ మంగళవారం మున్సిపల్ కమిషనర్ మధుసూదనరెడ్డికి వినతిపత్రం అందజేశారు. మసీదు రోడ్డువీధి గుంతలమయం కావడంతో వర్షం పడితే పలు అవస్థలు పడాల్సి వస్తోందని, రాకపోకలకు ఇబ్బందిగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషనర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

రబీలో ఆరుతడి పంటల సాగే మేలు

– ఏడీఏ శివకుమార్



గంగవరం: పొలం పిలుస్తోందిలో పాల్గొన్న ఏడీఏ శివకుమార్

గంగవరం: వ్యవసాయంలో భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువులు వాడాలని ఏడీఏ శివకుమార్ కోరారు. మండలంలోని మారేడుపల్లె, దండపల్లెలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రబీ సీజన్‌లో వరి పంట సాగు తగ్గించి ఆరుతడి పంటలైన ఉలవలు, జొన్నలు, రాగులు మొదలైనవి సాగు చేయాలని రైతులకు సూచించారు. రబీ 2024-25వ సీజన్‌కు సంబంధించి రైతులు స్వచ్ఛందంగా పంటల బీమా కోసం నమోదు చేసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద దిగుబడుల ఆధారంగా జిల్లాలో వరి, వేరుశనగ రెండు పంటలపై నోటిఫై చేసినట్లు చెప్పారు. నిర్ణయించిన తేదీల్లోపు ఈ పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లిస్తే పంట బీమా పొందవచ్చన్నారు. అనంతరం పంటలను సందర్శించి ఎరువుల వాడకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారిణి హేమలత, ఆర్ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి

పులిచెర్ల(కల్లూరు): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయ శాఖాధికారి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండలంలోని 106 రామిరెడ్డి గారిపల్లె, ఎల్లంకివారిపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, భూసార పరీక్షల ఆధారంగా పంటల సాగులో ఎరువులు వాడాలన్నారు. రైతులు డ్రిప్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ నాగపద్మిని, సిబ్బంది విజయ, అఖిల, రైతులు పాల్గొన్నారు.

రొంపిచెర్ల మండలంలో..

రొంపిచర్ల: పంటల సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలని ప్రత్యేక అధికారి, వ్యవసాయ సహాయ సంచాలకులు మధుసూదన్ రెడ్డి అన్నారు. మండలంలోని జగడంవారిపల్లె, కల్లావారిపల్లెలో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం, భూసార పరీక్షలను గురించి వివరించారు. ఏడీ నాగపద్మిని, ఏఓ సుధారాణి, ఏఈఓ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



పులిచెర్ల: ఎల్లంకివారిపల్లెలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు



రొంపిచెర్ల: మాట్లాడుతున్న అధికారులు

రెవెన్యూ సదస్సులో వినతుల వెల్లువ



పెద్దపంజాణి: అర్జీలను స్వీకరిస్తున్న ఆర్డీఓ భవాని

పెద్దపంజాణి: మండలంలోని కోగిలేరులో మంగళవారం తహసీల్దార్ ప్రసన్న కుమార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలమనేరు ఆర్డీఓ భవాని ముఖ్య అతిథి హాజరయ్యారు. పలు సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 107 అర్జీలు వచ్చాయని ఆర్డీఓ చెప్పారు. ఇందులో మ్యుటేషన్, అన్నదమ్ముల భాగ పరిష్కారాలు, పాసు పుస్తకాలు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో భూమికి సంబంధించిన వివరాలు లేకపోవడం తదితర సమస్యలు ఉన్నాయని, క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వీఆర్వో శివ, సర్పంచ్ రమేష్ బాబు, మాజీ ఎంపీపీ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చారాలలో 26 అర్జీలు

చౌడేపల్లె: మండలంలోని చారాలలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 26 మంది రైతుల నుంచి అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ హనుమంతు నాయక్ తెలిపారు. పాసు పుస్తకాల మంజూరు, 1-1-బిలో సర్వే నంబర్లు చేర్చాలని కోరుతూ అర్జీలిచ్చినట్లు చెప్పారు. నిర్ణీత గడువులోపు రికార్డులను పరిశీలించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయకుమారి, ఆర్ఐ భారతి, సర్వేయర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెరుకువారిపల్లెలో 43 వినతులు

సదుం: రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తహసీల్దార్ మారుఫ్ హుస్సేన్ అన్నారు. మండలంలోని చెరుకువారిపల్లె సచివాలయంలో మంగళవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుంచి వివిధ సమస్యలపై మొత్తం 43 వినతులు అందినట్లు ఆయన చెప్పారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పెద్దపంజాణి: పెద్దపంజాణి పీఏసీఎస్ మాజీ చైర్మన్ సంపల్లి బాబు రెండవ కుమారుడు రిషిచరణ్ వివాహం శనివారం గుంటూరులో జరిగింది. తదుపరి వరుడి స్వగృహం సంపల్లె మంగళవారం శ్రీ సత్యనారాయణ స్వామి పూజ, రిసెప్షన్ నిర్వహించారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మాజీ ఎంపీ ఎన్.రెడ్డెప్ప తదితరులు హాజరై వధూవరులు తేజో మహిత, రిషి చరణ్‌లను ఆశీర్వదించారు. అలాగే పలువురు పార్టీ నాయకులు వారికి ఆశీస్సులు పలికారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలో నివాసమున్న మోహన్‌రెడ్డి కుమార్తె లిఖిత, వినోద్‌కుమార్, అలాగే మాజీ ఎంపీపీ నరసింహులు కుమార్తె అనూషా, మనోహర్‌ల వివాహ వేడుకల్లో మంగళవారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో కర్ణాటక అధికారి



డిప్యూటీ కమిషనర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మను దివ్యాంగ క్రికెట్ బోర్డ్ ఆఫ్ ఇండియా కర్ణాటక రాష్ట్ర డిప్యూటీ కమిషనర్ వి.చిన్నప్ప(రాజు) మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఉప కమిషనర్ ఏకాంబరం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ చరిత్రను వేదపండితులు వివరించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలను అందజేసి ఆశీర్వచనం పలికారు. ఆయన వెంట సూపరింటెండెంట్ రామనాథం, మణి ఉన్నారు.

బాడీ బిల్డర్‌కు అభినందన



దినేష్‌ను సత్కరిస్తున్న బీసీఎస్ కళాశాలల యాజమాన్యం

కుప్పం రూరల్: బీసీఎస్ విద్యాసంస్థల చైర్మన్ బీసీ నాగరాజు మంగళవారం తమ కళాశాల ఎంబీఏ మొదటి సంవత్సరం విద్యార్థి ఎస్. దినేష్‌ను సత్కరించారు. గోవాలో జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో అతడు బంగారు పతకం సాధించడంతో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నాగరాజు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి వ్యాయామం చేయడం ఒక వ్యాపకంగా మలచుకోవాలన్నారు. అప్పుడే శరీరాకృతి చక్కగా ఉంటుందన్నారు. దినేష్ రాబోవు రోజుల్లో అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, పీఆర్ఓ ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో పక్కా భవన నిర్మాణం!

- డీకేటీ భూమికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణ
- కూటమి నేతల అండదండలతోనే సాగుతున్న తంతు
- మున్సిపాలిటీలోని టీఎస్ అగ్రహారంలో వెలుగులోకి



ప్రభుత్వ అనాధీనంలో చేస్తున్న భవన నిర్మాణ పనులు

పలమనేరు: రైతులకు ఇచ్చిన డీ- పట్టాల భూముల పక్కనే ఉన్న ప్రభుత్వ అనాధీనం పొరంబోకును సైతం ఓ రైతు ఆక్రమించి దర్జాగా భవనాన్ని నిర్మిస్తుండటం మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలు... మున్సిపాలిటీలోని టీఎస్ అగ్రహారం రోడ్డులో అదే గ్రామానికి చెందిన కొత్తింటోళ్ల రామిరెడ్డి డీకేటీ భూమి సర్వే నంబర్:834/8లో 37 సెంట్లు ఉంది. ఈ భూమికి ఆనుకుని రోడ్డుకు సర్వే నంబర్:834/17లో ప్రభుత్వ అనాధీనం పొరంబోకు భూమి 4 సెంట్లు ఉంది. దీనిని తన డీకేటీలో కలుపుకోవాలని రైతు రామిరెడ్డి కుమారురు శంకర్‌రెడ్డి కన్నేశాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పక్కా ప్లాన్ సిద్ధం చేసుకున్నాడు. స్థానికంగా ఇద్దరు కూటమి నేతలతో డీల్ కుదుర్చుకుని డీకేటీతోపాటు అనాధీనం భూమిని కలుపుకుని షెడ్డు నిర్మాణానికి పూనుకున్నాడు. దీనిని గుర్తించిన గ్రామస్తులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది. దీనిపై సంబంధిత గ్రామ వీఆర్వో పవన్‌కుమార్‌ను వివరణ కోరగా..అక్కడ రైతు శంకర్‌రెడ్డి కొంత ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు చేస్తుండటం వాస్తవమేనన్నారు. దీనిపై తాము అభ్యంతరం తెలిపి అక్కడి నిర్మాణాలను నిలుపుదల చేయించామన్నారు. మళ్లీ నిర్మాణాలు చేస్తున్న విషయం తెలియదని, దీనిపై విచారణ చేసి తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు.